సాక్షి
అనంతపురం
సోమవారం । 15 । మే । 2023



నేటి నుంచి ఏపీఈఏపీసెట్

ఇంజినీరింగ్, అగ్రి, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఈఏపీ సెట్ ప్రారంభం కానుంది. 8లో



'స్నాతకోత్సవ' గడువు పొడిగింపు

ఎస్కేయూ స్నాతకోత్సవ పట్టా దరఖాస్తు గడువును ఈ నెల 22 వరకు పొడిగించినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు.



జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం, ఉక్కపోత పెరిగింది. గంటకు 5 నుంచి 8 కి.మీ వేగంగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

తల్లిని మించిన దైవం లేదు



తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం కల్చరల్: తల్లిని మించిన దైవం ఉండదని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. ప్రేమ, ఆప్యాయతలకు మారుపేరైన తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూసుకోవాలని సూచించారు. అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కలెక్టర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో సాగిన సామూహిక ఒడిబియ్యం కార్యక్రమంలో ఆడపడుచులకు కలెక్టర్ శాస్త్రోక్తంగా ఒడిబియ్యం అందించారు. మాతృదినోత్సవం కలిసి రావడంతో ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడే తన తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాకులు ప్రమోద్ స్వామితో పాటు కమిటీ సభ్యులు, పలు హిందుత్వ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి రేపు రాక



అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ) పోతిరెడ్డి నాగార్జునరెడ్డి ఈ నెల 16న జిల్లాకు వస్తున్నారు. అదే రోజున గ్రామ సచివాలయాలను తనిఖీ చేస్తారు. ఉపాధి హామీ పథకం, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, పంచాయతీ రోడ్లు, గ్రామీణ నీటి వసతి, తదితర అంశాలపై అధికారులతో సమీక్షించనున్నారు. 17న జిల్లా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో పాల్గొంటారు.

జీసీడీఓ పోస్టుకు నోటిఫికేషన్

రాప్తాడురూరల్: సమగ్ర శిక్ష కార్యాలయంలోని గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీసీడీఓ) పోస్టు భర్తీకి కలెక్టర్ ఆదేశాలతో నోటిఫికేషన్ విడుదలైంది. ఆసక్తిగల మహిళా ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, డైట్ కళాశాల అధ్యాపకులు ఈ నెల 16 మధ్యాహ్నం 3 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ అధికారి, డీఈఓ సాయిరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత ధ్రువపత్రాలు జత చేయాలని సూచించారు. దరఖాస్తును http://samagrashikshaatp.blogspot.com వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

శ్రీగంధం సాగుపై రేపు అవగాహన సదస్సు



బుక్కరాయసముద్రం: రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 16న బెంగళూరుకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐడబ్ల్యూఎస్టీ) వారి సహకారంతో శ్రీగంధం సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీగంధం సాగులో రైతులకు మెలుకువలు, యాజమాన్య పద్ధతులు, సందేహాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. శాస్త్రవేత్తలు డాక్టర్ సందీప్ చక్రవర్తి, గిరిబాబు హాజరవుతారన్నారు.

ఖాళీల భర్తీకి నేడు కౌన్సెలింగ్



అనంతపురం క్రైం: జిల్లా క్షయ నివారణ సంస్థలో సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్, తదితర పోస్టుల భర్తీకి సోమవారం ఉదయం 10.30 గంటలకు సర్వజనాస్పత్రిలోని టీబీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ అనుపమ జేమ్స్ తెలిపారు. ఇప్పటికే ఫైనల్ మెరిట్ జాబితాను అనంతపురం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ మార్కుల జాబితాతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

● పవనపుత్రా.. పాహిమాం..



డీ హీరేహాళ్ మండలం మురడి ఆంజనేయస్వామి



ప్రత్యేక అలంకరణలో బొమ్మనహాళ్ మండలం నేమకల్లు ఆంజనేయస్వామి


జిల్లా అంతటా హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం వేకువ జాము నుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ చాలీసా పఠించి.. రామనామ జపం చేశారు. ఆలయ పరిసరాలు హనుమన్‌నామ స్మరణతో ప్రతిధ్వనించాయి. అంజన్న ధైర్యం, విధేయత, విశ్వాసం, నమ్మకం, భక్తి, నిస్వార్థత, చురుకుతనం తదితర గుణాల గురించి పండితులు వివరించారు. జగదభిరాముడి పట్ల మారుతికి ఉన్న అచంచలమైన భక్తిని తెలుసుకుని భక్తులు తరించారు. – సాక్షి బృందం



గుంతకల్లు మండలం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శనం కోసం పోటెత్తిన భక్తులు



రాప్తాడు మండలం హంపాపురం మౌనగిరి క్షేత్రంలో పూజలు అందుకున్న ఆంజనేయస్వామి



అనంతపురం రూరల్ మండలం సోమలదొడ్డి వద్దనున్న అభయాంజనేయస్వామి విగ్రహం

మండుటెండలో జలసవ్వడి

- పాతాళ గంగ పదిలం
- 7.8 మీటర్ల సగటు నీటిమట్టం నమోదు
- 1.88 లక్షల బోరుబావుల్లో పుష్కలంగా నీరు

అనంతపురం అగ్రికల్చర్: భగభగమండే ఎండాకాలంలోనూ భూగర్భజలాలు సవ్వడి చేస్తున్నాయి. అకాల వర్షాలు విస్తారంగా కురవడంతో నీటిమట్టం అంతకంతకూ పెరిగింది. జిల్లాలో ఎక్కడా తాగు, సాగునీటికి కొరత లేకుండా పాతాళగంగమ్మ పైపైన కనిపిస్తోంది. భూగర్భజలశాఖ తాజాగా 97 ఫిజో మీటర్ల నుంచి సేకరించిన గణాంకాలు పరిశీలిస్తే ప్రస్తుత సగటు నీటిమట్టం 7.84 మీటర్లుగా నమోదైంది. వైశాఖం లాంటి మండుటెండల్లోనూ ఈస్థాయిలో భూగర్భజలాలు ఉండటం విశేషం. నాలుగేళ్ల కిందట వరకు 20 నుంచి 25 మీటర్ల పాతాళానికి పడిపోయిన నీటిమట్టం ఇప్పుడు పూర్తిగా మారిపోవడం గమనార్హం.

46 శాతం అధికంగా వర్షాలు..

గత ఏడాది జూన్ ఒకటి నుంచి ఏప్రిల్ చివరి నాటికి 476 మి.మీ వర్షం పడాల్సి ఉండగా 46 శాతం అధికంగా 693 మి.మీ నమోదైంది. వర్షాల రూపంలో 250 టీఎంసీలు ప్రవహించగా అందులో 30 టీఎంసీల వరకు భూగర్భంలో ఇంకిపోయాయి. హెచ్చెల్సీ, హంద్రీ-నీవా ద్వారా కోటా మేరకు నీళ్లు విడుదల చేసి వందలాది చెరువులు నింపుతుండటంతో జిల్లా వ్యాప్తంగా జలకళకు సంతరించుకుంది. రైతులు, కూలీలకు తీరికలేకుండా చేతినిండా సేద్యపు పనులు ఉండటంతో గతంలో మాదిరిగా వేరే ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన అవసరం ఏర్పడలేదు. మూడున్నరేళ్లుగా క్రమం తప్పకుండా విస్తారంగా వర్షాలు పడటంతో భూగర్భజలాలు రికార్డుస్థాయిలో పైపైకి చేరుకున్నాయి. తాజా గణాంకాల ప్రకారం సగటున 7.84 మీటర్లలోనే కనిపిస్తున్నాయి.



బోరుబావి నుంచి సమృద్ధిగా వస్తున్న నీరు

సేఫ్ జోన్‌లో 30 మండలాలు

● యల్లనూరు మండలంలో అత్యధికంగా భూగర్భ జలాలు వినియోగిస్తుండగా.. మిగతా 30 మండలాలు సురక్షిత జాబితా (సేఫ్‌జోన్)లో ఉన్నట్లు భూగర్భ జల శాఖ డీడీ కె.తిప్పేస్వామి తెలిపారు. యాడికి మండలం నగరూరు ఫిజోమీటర్‌లో 27.84 మీటర్లు, శెట్టూరు ఫిజోమీటర్‌లో 23.97 మీటర్ల అత్యంత లోతు (డెప్త్)లో నమోదైందన్నారు. ఇక పెద్దపప్పూరు మండలం పెద్దఎక్కలూరులో 0.82 మీటర్లు, గుమ్మఘట్టలో 0.86 మీటర్ల అత్యంత పైపైన నీటిమట్టం నమోదైనట్లు తెలిపారు. దీంతో వాల్టా గ్రామాల సంఖ్య 12కు పడిపోయినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1.88 లక్షల బోరు బావుల్లో పుష్కలంగా నీళ్లు వస్తుండటంతో అన్నదాతకు చేతినిండా సేద్యపు పనులు ఉన్నాయి.

మండలాల వారీగా తాజా సగటు నీటి మట్టం

మండలం	నీటిమట్టం మీటర్లలో	మండలం	నీటిమట్టం మీటర్లలో
అనంతపురం	4.77	ఆత్మకూరు	3.86
బీకే సముద్రం	4.72	బెళుగుప్ప	10.59
బొమ్మనహాళ్	5.84	బ్రహ్మసముద్రం	6.92
డి.హీరేహాళ్	13.20	గార్లదిన్నె	2.15
గుత్తి	10.31	గుమ్మఘట్ట	6.37
గుంతకల్లు	4.08	కళ్యాణదుర్గం	8.15
కంబదూరు	7.12	కణేకల్లు	10.82
కూడేరు	7.30	కుందుర్పి	5.61
నార్పల	5.24	పామిడి	10.53
పెద్దపప్పూరు	0.82	పెద్దవడుగూరు	4.42
పుట్లూరు	9.45	రాప్తాడు	3.36
రాయదుర్గం	6.00	శెట్టూరు	18.93
శింగనమల	7.26	తాడిపత్రి	9.19
ఉరవకొండ	4.06	వజ్రకరూరు	6.94
విడపనకల్లు	3.69	యాడికి	18.27
యల్లనూరు	9.76		

గిరిజన గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ఉరవకొండ: స్థానిక గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను మూడో తరగతి నుంచి ఆరో తరగతి వరకు ప్రవేశాలకు అర్హులైన బాలికలు ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈమేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడో తరగతిలో 40 సీట్ల (ఎస్టీలకు 30, ఎస్సీలకు 5, బీసీలకు 2, ఓబీసీలకు, ఏఈక్యూలకు 1, పీజీటీలకు 1)ను రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేస్తామని పేర్కొన్నారు. నాలుగో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు 93 సీట్లను ఎస్టీ విద్యార్థినులతో మాత్రమే భర్తీ చేస్తామని వెల్లడించారు. తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ.లక్ష లోపు ఉండాలన్నారు. నాలుగో తరగతిలో 32, ఐదో తరగతిలో 26, ఆరోతరగతిలో 15, అలాగే 7, 8, 9 తరగతిలో 13 సీట్లు చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హులైన వారు నేరుగా ఉరవకొండ పట్టణంలోని శాంతినగర్‌లో పాఠశాలకువచ్చి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తరగతుల వారీగా వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించి జూన్ 10న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సమక్షంలో లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు.

పార్టీ శ్రేణులు ఏకం కావాలి

- కలిసి పనిచేస్తే మళ్లీ మనమే విజేతలం
- చిన్న చిన్న సమస్యలు సహజమే
- వైఎస్సార్‌సీపీ నాయకులకు పెద్దిరెడ్డి దిశానిర్దేశం
- మూడురోజుల పాటు నియోజకవర్గాల వారీగా సమీక్ష



జేసీఎస్ కన్వీనర్లతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

'అందరం ఐకమత్యంతో పనిచేస్తే మళ్లీ మనమే విజేతలం. జిల్లాలో మళ్లీ క్లీన్‌స్వీప్ చేసే దిశగా.. అన్ని నియోజకవర్గాల్లో గెలిచే విధంగా అడుగులు వేయాలి. మన పార్టీ అతిపెద్ద కుటుంబం లాంటిది. కుటుంబం అన్నాక చిన్న చిన్న సమస్యలు వస్తుంటాయి. వాటిని మనం పరిష్కరించుకుని శత్రువును ఢీకొట్టాలి' అని వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నాయకులను ఆదేశించారు. గత మూడు రోజులుగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆయన సమీక్షలు నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని జిల్లాలో ఎలా ముందుకు నడిపించాలో శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ప్రతి ఇంట్లోనూ ఓ వైసీపీ సైనికుడు..

పనిచేసే వారికి పార్టీలో సముచిత స్థానం దక్కుతుందని, ఎవరికి టికెట్ ఇచ్చినా అభ్యర్థికి సహకరించాలని మంత్రి పెద్దిరెడ్డి సూచించారు. అధికార పగ్గాలు చేపట్టిన నాలుగేళ్ల తర్వాత కూడా 'గడప గడపకూ మన ప్రభుత్వం' పేరుతో ఇంటింటికీ వెళ్లగలుగుతున్నామన్నారు. ఇలా చరిత్రలో ఏ పార్టీ చేయలేదని, ప్రతి ఇంటికీ లబ్ధి చేశామని అన్నారు. లబ్ధి చేకూరిన ప్రతి ఇంటిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పనిచేసే ఒక సైనికుడు ఉండేలా చూడాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీని విజయపథంలో నడిపిస్తే మీ కృషికి తగిన గుర్తింపు లభిస్తుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేలు కూడా నాయకులందరినీ కలుపుకుని పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు.

చంద్రబాబు మోసం చేయడానికి సిద్ధంగా ఉన్నారు..

'చంద్రబాబు ఒకసారి మామకు వెన్నుపోటు పొడిచి సీఎం అయ్యారు. మరో రెండుసార్లు పొత్తులు పెట్టుకుని గద్దెనెక్కారు. మూడుసార్లు సీఎం అయినా ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదు. అందుకే శాశ్వతంగా ఆయన్ను పక్కన పెట్టారు. మీరు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా పచ్చపత్రికల అండతో బాబు జనాన్ని మోసం చేసి అధికారం చిక్కించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. దీన్ని సోషల్ మీడియా ద్వారా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తిప్పికొట్టాలి. వచ్చే ఎన్నికలు మనకు అత్యంత ప్రతిష్టాత్మకమైనవ'ని పార్టీ శ్రేణులకు సూచించారు.

నాయకుల్లో భరోసా..

మూడు రోజుల పాటు మంత్రి ఇక్కడే ఉండి నియోజకవర్గాల వారీగా సమీక్షలు, చర్చలు జరపడంతో నియోజకవర్గ స్థాయి నాయకులు, ద్వితీయ శ్రేణి నాయకుల్లో భరోసా వచ్చింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కష్టపడి పనిచేసిన ఎంతోమందికి పదవులు వచ్చాయి. మనకు కూడా అలాంటి అవకాశం ఎందుకు రాదు అని నాయకులు ఆలోచించారు. కొంతమంది చిన్న చిన్న సమస్యలు ఆయన దృష్టికి తేగా.. వాటిని పరిష్కరిస్తామని పెద్దిరెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారు. నాయకులు ఒకే వేదికపై చేరి వివిధ అంశాలపై చర్చించడంతో అందరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశాలతో వైఎస్సార్ సీపీ నాయకుల్లోనూ, శ్రేణుల్లోనూ కొత్త ఉత్సాహం వచ్చినట్టయింది.

విజయదుందుభి మోగిద్దాం

- జేసీఎస్ కన్వీనర్లకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు

అనంతపురం రూరల్: పార్టీ శ్రేణులు, జేసీఎస్ కన్వీనర్లు సమష్టిగా పనిచేసి 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయదుందుభి మోగించాలని వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. 'జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్' మెగా సర్వేలో రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా మొదటిస్థానంలో నిలవడంతో, ఇందుకు కారకులైన జేసీఎస్ కన్వీనర్లకు ఆదివారం అనంతపురం రూరల్ మండలం నాగిరెడ్డిపల్లి సమీపంలోని గ్రీన్ హుడ్స్ రిసార్ట్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హాజరయ్యారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించడమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమని అన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకే పాలన తీసుకొచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వలంటీర్ వ్యవస్థను ఇతర రాష్ట్రాల్లో అనుసరించేందుకు ప్రయత్నిస్తుండటం గర్వకారణమన్నారు.

మంచిని ఓర్వలేని టీడీపీ నేతలు

జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం జరుగుతుంటే ప్రతిపక్ష టీడీపీ నాయకులు తట్టుకోలేకపోతున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. 2014 అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టాక వాటిని అమలు చేయకుండా విస్మరించారని ధ్వజమెత్తారు. ప్రజా సొమ్మును టీడీపీ నాయకులకు దోచిపెట్టి.. రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. ఏనాడూ ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని చంద్రబాబు తాను మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలకు అన్ని సంక్షేమ ఫథకాలు అందిస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యకర్తలు, నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో పని చేసి రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో విజయఢంకా మోగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గౌస్‌బేగ్, పెన్నోబిలేసు పాల్గొన్నారు.

పాలనలో బడుగులకు పెద్దపీట



మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కార్యదర్శి రాంప్రసాద్

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ పాలనలో దళిత, గిరిజన, మైనార్టీ, బడుగులకు పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ తెలిపారు. కళ్యాణదుర్గం మార్కెట్‌యార్డులో ఆదివారం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎంపికైన ఎస్సీ సామాజికవర్గానికి చెందిన తిమ్మరాజమ్మ, వైస్ చైర్మన్‌గా బీసీ సామాజికవర్గానికి చెందిన దాసరి రామ మోహన్ యాదవ్, కమిటీ సభ్యులతో మార్కెట్ కమిటీ కార్యదర్శి రాంప్రసాద్ మంత్రి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రమూ అమలు చేయని విధంగా మన రాష్ట్రంలో నామినేటెడ్ పదవులను అన్ని సామాజిక వర్గాల వారికీ కేటాయించారన్నారు. ముఖ్యంగా మార్కెట్ కమిటీలో రైతులే సభ్యులుగా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం రైతులను, బడుగు బలహీన వర్గాలను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుందని విమర్శించారు. రాబోవు రోజుల్లో రైతులకు మరింత సేవ చేయాలన్న సంకల్పంతో కమిటీలో సభ్యులను పారదర్శంగా ఎంపిక చేశామని చెప్పారు. నూతన పాలకవర్గం చిత్తశుద్ధితో రైతులకు సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీలు మారుతమ్మ, కమలమ్మ, లక్ష్మీదేవి, చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రాధాస్వామి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, రాష్ట్ర జానపద, సృజనాత్మక కార్పొరేషన్ డైరెక్టర్ బాబురెడ్డి, నాయకులు నరేంద్రరెడ్డి, తిరుమల వెంకటేశులు, ములకనూరు గోవిందు, సోమనాథ్‌రెడ్డి, రమేష్, రామకృష్ణ, హరినాథ్‌రెడ్డి, గోళ్ల మోహన్‌రెడ్డి, శివలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● అరటికి ఈతాకు గొడుగు



రాప్తాడు: మండలంలోని హంపాపురం, గొల్లపల్లి, మరూరు, ఎం.బండమీదపల్లి, యర్రగుంట, బుక్కచెర్ల, జి.కొత్తపల్లి తదితర గ్రామాల్లో రైతులు తాము సాగు చేసిన అరటి మొక్కలను ఎండ నుంచి రక్షించుకునేందుకు ఈత ఆకులను వాడుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి, ముదిగుబ్బ, ధర్మవరం ప్రాంతాలలో ఈత ఆకులను రూ.2 నుంచి రూ.5 చొప్పున కొనుగోలు చేసి తీసుకొచ్చామని రైతులు తెలిపారు. వివిధ రకాల జంతువుల బారినపడకుండా అరటి మొక్కలకు ఈత ఆకులు శ్రీరామరక్షగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

చింతలరాయుడి సన్నిధిలో జిల్లా జడ్జి



పూజల్లో పాల్గొన్న జిల్లా జడ్జి శ్రీనివాస్, కుటుంబసభ్యులు

తాడిపత్రి టౌన్: స్థానిక చింతల వేంకటరమణ స్వామి ఆలయాన్ని కుటుంబసమేతంగా జిల్లా జడ్జి శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు, ఆలయ పాలక మండలి చైర్మన్ బాణా నాగేశ్వరరెడ్డి స్వాగతం పలికారు. విశేష పూజల అనంతరం ఆలయ చరిత్రను అర్చకులు వివరించారు. కార్యక్రమంలో తాడిపత్రి డీఎస్పీ గంగయ్య పాల్గొన్నారు.

ఎస్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం: స్థానిక గిరిజన (ఎస్టీ) గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 3వ తరగతిలో 40 సీట్లకు గాను 32 సీట్లు ఎస్టీలకు, 5 ఎస్సీలకు, 2 బీసీలకు, 1 ఓసీకు కేటాయించారు. 4వ తరగతిలో 38, 5వ తరగతిలో 32, 6వ తరగతిలో 20, 7వ తరగతిలో 2, 8వ తరగతిలో 5, 9వ తరగతిలో 8 చొప్పున ఖాళీలు ఉన్నాయి. 4 వ తరగతి నుంచి 9 వరకూ ఖాళీగా ఉన్న సీట్లన్నీ బ్యాక్‌లాగ్ కింద ఎస్టీ విద్యార్థులకు కేటాయించారు.

● మరుపురాని స్నేహం..



కంబదూరు: 1998-99 బ్యాచ్ విద్యార్థులతో నాటి ఉపాధ్యాయులు



ఉరవకొండ: 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



బొమ్మనహాళ్: 1997-98లో పదో తరగతి చదివిన విద్యార్థులు

వాను వాళ్లది మరుపురాని స్నేహం.. పాతికేళ్ల క్రితం వేర్వేరు ప్రాంతాల్లోని పాఠశాలల్లో పదో తరగతి చదువుకున్నారు. బతుకుపోరులో భాగంగా వివిధ హోదాల్లో ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఇప్పటి వరకూ ఫోన్ పలకరింపులకే పరిమితమైన వారంతా... ఒక్కటిగా కలవాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా.. తాము చదువుకున్న పాఠశాల వేదికగా ఆదివారం ఒక్కటయ్యారు. ఆత్మీయ పలకరింపులతో మురిసిపోయారు. చిన్ననాటి అల్లర్లు గుర్తు చేసుకుని ఆటపాటలతో సందడి చేశారు. ఈ మధుర క్షణాలకు బొమ్మనహాళ్, కంబదూరు గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు.. ఉరవకొండలోని ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికయ్యాయి. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు బొమ్మనహాళ్‌లో ఈశ్వరరెడ్డి, నిర్మలాబాయి, రాజ్‌కుమార్, యరాల్డ్, జాలప్ప రెడ్డి, కంబదూరులో సుగుణాబాయి, మస్తానప్ప, శివారెడ్డి, భీమన్న, నాగరాణి, నీలి హనుమంతరాయుడు, రామాంజినేయులు, శ్రీరాములు, ప్రస్తుత హెచ్‌ఎం కృష్ణానాయక్, ఉరవకొండలో మార్టిన్, శ్రీపతి, శ్రీనివాసులు, నాగరాజు, నారాయణప్ప, యాసిన్, రాజేశ్వరి, ప్రమీలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

– కంబదూరు/ఉరవకొండ/బొమ్మనహాళ్:

నేటి నుంచి ఏపీఈఏపీసెట్

అనంతపురం: రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి ఏపీఈఏపీసెట్ ప్రారంభం కానుంది. ఈ క్రమంలో సెట్ బాధ్యతను రెండో సారి తీసుకున్న జేఎన్‌టీయూ (అనంతపురం).. ప్రవేశ పరీక్ష నిర్వహణను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇందుకు సంబంధించి ఏపీఈఏపీసెట్ రాష్ట్ర చైర్మన్ ఆచార్య జింకా రంగజనార్దన, రాష్ట్ర కన్వీనర్ ఆచార్య సి.శోభాబిందు నేతృత్వంలో ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకూ 136 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అలాగే అగ్రి, ఫార్మసీ విభాగాల్లో ప్రవేశాలకు సంబంధించి 22, 23 తేదీల్లో పరీక్ష జరగనుంది.

సాంకేతిక విద్యకు పెరిగిన డిమాండ్..

రాష్ట్రంలో విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను జగన్ సర్కార్ పారదర్శకంగా అమలు చేస్తుండడంతో సాంకేతిక విద్యను అభ్యసించే వారి సంఖ్య నానాటికీ పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో గత ఏడాది నిర్వహించిన ఏపీఈఏపీ సెట్‌కు సంబంధించి మొత్తం 3,00,111 మంది దరఖాస్తు చేసుకోగా... ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి 2,05,518 మంది, అగ్రి – ఫార్మసీ కోర్సులకు సంబంధించి 93,532 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది ఈ సంఖ్య భారీగా పెరిగింది. ఇంజినీరింగ్ విభాగానికి 2,37,193 మంది, అగ్రి – ఫార్మసీ కోర్సులకు 99,557 మంది, మరో 983 మంది రెండు విభాగాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ లెక్కన గత ఏడాది కంటే 37,622 మంది సాంకేతిక విద్య పట్ల ఆకర్షితులయ్యారనేది స్పష్టమవుతోంది.



ఏపీ ఈఏపీసెట్-2023 దరఖాస్తులు ఇలా..

వర్సిటీ పరిధి				
ఏయూ	1,49,596	57,363	408	2,07,367
ఎస్వీయూ	72,620	37,711	273	1,10,604
ఓయూ	12,486	3,307	131	15,924
మొత్తం	2,37,193	99,557	983	3,37,733
జెండర్ వారీగా...				
కేటగిరి	ఇంజనీరింగ్	అగ్రికల్చర్	రెండూ	మొత్తం
అమ్మాయిలు	97,093	71,057	568	1,68,718
అబ్బాయిలు	1,40,100	28,500	415	1,69,015

హాల్‌టికెట్ సరిచూసుకోండి..

సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఏపీఈఏపీ సెట్‌కు సంబంధించి ఇప్పటికే జారీ చేసిన హాల్ టికెట్లలో ముద్రించిన వివరాలు సరి చూసుకోవాలని అభ్యర్థులకు సెట్ చైర్మన్ ఆచార్య జింకా రంగజనార్దన సూచించారు. తేడాలు ఏమైనా ఉంటే ఏపీఈఏపీసెట్-2023 హెల్ప్‌డెస్క్ లేదా ఈ-మెయిల్ ద్వారా సంప్రదించాలని కోరారు.

ఇవి తప్పనిసరి..

- పరీక్ష కేంద్రానికి హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా వ్యక్తిగత గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాలి. ఇంటర్మీడియట్ హాల్‌టికెట్, పాస్‌పోర్ట్, పాన్‌కార్డు, ఓటరు ధ్రువపత్రం, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌లలో ఏదైనా ఒకటి వర్తిస్తుంది.
- బ్లూ కలర్ బాల్ పాయింట్ పెన్ను, పూర్తి చేసిన ఆన్‌లైన్ దరఖాస్తు పత్రం, అటెస్ట్ చేయబడిన కుల ధ్రువీకరణ పత్రం (ఎస్సీ, ఎస్టీ కేటగిరి అభ్యర్థులకు మాత్రమే – ఏపీ ఈఏపీసెట్ అర్హత మార్కులు ఎస్సీ, ఎస్టీ కేటగిరి అభ్యర్థులకు లేవు కాబట్టి కుల ధ్రువీకరణ పత్రం అనివార్యం) తీసుకెళ్లాలి.
- అభ్యర్థులు పరీక్ష హాలులోకి ప్రవేశించిన అనంతరం బయోమెట్రిక్ సమాచారాన్ని సేకరించడం జరుగుతుంది. అభ్యర్థులకు ఫొటో తీయడంతో పాటు ఎడమ చేతి బొటనవేలి ముద్రను తీసుకుంటారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ చేతులకు, పాదాలకు ఎలాంటి కెమికల్స్, మెహందీ, ఇంక్ వంటి పదార్థాలు వినియోగించకుండా ఉండడం మేలు.
- పరీక్ష హాలులో ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాన్ని పూర్తిగా నింపి, ఫొటోను అతికించి, దానిపై ఇన్విజిలేటర్ ఎదురుగా సంతకం చేసి ఇవ్వాలి.
- పరీక్ష మొదలైన ఉదయం 9 గంటల తర్వాత మధ్యాహ్నం 3 గంటల వరకూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యంగా వచ్చే వారిని లోపలకు అనుమతించరు. పరీక్ష సమయం పూర్తయ్యే వరకూ అభ్యర్థులను బయటకు పంపరు.
- కేటాయించిన కంప్యూటర్‌లో ఏదైనా సాంకేతిక సమస్య ఉత్పన్నమైతే... వెంటనే ఇన్విజిలేటర్‌కు తెలపాలి. ఒకవేళ సమస్య పరిష్కారం కాకపోతే మరో కంప్యూటర్‌ను కేటాయిస్తారు. ఈ క్రమంలో వృథా అయిన సమయాన్ని అదనంగా ఇస్తారు.
- కాలిక్యులేటర్లు, లాగరిథమ్ టేబుళ్లు, పేజర్లు, మొబైల్ ఫోన్లు, చేతి గడియారాలు, పెద్ద కళ్లద్దాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, ఖాళీ కాగితాలు పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడవు.
- అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తు చేసి ఉన్నా.. కేవలం ఒకసారి మాత్రమే పరీక్ష రాసే అవకాశం ఉంటుంది. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీన, సెషన్స్ బట్టి హాజరుకావాలి. లేకపోతే గైర్హాజరుగా పరిగణిస్తారు.
- పరీక్ష హాలులో రఫ్‌వర్క్ చేయడానికి అభ్యర్థులకు ఖాళీ కాగితాలు ఇస్తారు. పరీక్ష పూర్తి కాగానే తాము తీసుకున్న కాగితాలపై హాల్‌టికెట్ నంబర్ రాసి ఇన్విజిలేటర్‌కు అందజేయాలి. లేకపోతే వారిని బయటికు పంపరు.
- అభ్యర్థుల మొబైల్ ఫోన్లకు, ఇతర విలువైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను సురక్షితంగా ఉంచడానికి ఎలాంటి ప్రత్యేకమైన ఏర్పాట్లు ఉండవు.
- ఏ సమాచారం కావాలన్నా https://cets.apsche.ap.gov.in/EAPCET వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.
- అనుమానాల నివృత్తికి helpdeskapeapcet2023@gmail.comకు మెయిల్, లేదా (08554) 234311, 232248 నంబర్లకు కాల్ చేయవచ్చు.

జిల్లాలోని పరీక్ష కేంద్రాలు ఇవే..

జిల్లాలో మొత్తం ఇంజినీరింగ్‌కు 11,359 మంది, అగ్రి – ఫార్మసీ కోర్సులకు 4,898 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వీరికి 8 పరీక్ష కేంద్రాలను కేటాయించారు. కేటాయించిన కేంద్రాల్లో బుక్కరాయసముద్రం మండలంలోని ఎస్‌ఆర్‌ఐటీ, ఎస్కేయూ సమీపంలోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల, రాప్తాడు మండలం హంపాపురం సమీపంలోని ఎస్వీఐటీ, అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట శివారులోని పీవీకేకే, శ్రీబాలాజీ పీజీ కళాశాల, గుత్తి సమీపంలోని గేట్స్ కళాశాల, తాడిపత్రిలోని సీవీ రామన్, తాడిపత్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (టెక్) కళాశాలలున్నాయి. శ్రీసత్య సాయి జిల్లాలో ఇంజినీరింగ్‌కు 936 మంది, అగ్రి – ఫార్మసీ 421 మంది పరీక్షకు హాజరు కానున్నారు. వీరికి పుట్టపర్తిలోని సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాను పరీక్ష కేంద్రంగా ఎంపిక చేశారు.

ప్రాణం బలిగొన్న అతి వేగం



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

డి హీరేహాళ్(రాయదుర్గం): అతి వేగం ఓ యువకుడి ప్రాణాలు బలిగొంది. మరో యువకుడిని ఆస్పత్రి పాలు చేసింది. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం చదం గొల్లలదొడ్డి చెందిన గోపాల్(28) అదే గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం బళ్లారి మార్గం నుంచి రాయదుర్గం వైపు ద్విచక్రవాహనంపై మిత్రుడు వీరేష్‌తో కలసి వేగంగా దూసుకెళుతూ.. డి.హీరేహాళ్ మండలం కల్యం గ్రామ సమీపంలో వంతెన రక్షణ గోడను ఢీకొన్నారు. గోపాల్ అపస్మారక స్థితికి చేరుకోగా... వీరేష్‌కు తీవ్ర రక్తగాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అందే లోపు గోపాల్ మృతి చెందాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు సూచన మేరకు వీరేష్‌ను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు డి.హీరేహాళ్ ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు.

గొర్రెల మందపై చిరుత దాడి



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

రాయదుర్గం రూరల్: మండలంలోని కాశీపురం శివారులో గొర్రెల మందపై చిరుత దాడి చేసింది. ఈ మేరకు గొర్రెల యజమాని మద్దికెరనాయుడు కుమారుడు హులిరాజు తెలిపాడు. ఇంటి సమీపంలోని దొడ్డిలో వదిలిన గొర్రెలపై ఆదివారం తెల్లవారుజామున చిరుత దాడి చేసింది. 5 గొర్రెలు మృతి చెందాయి. మరో ఆరు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. సమాచారం అందుకున్న అటవీ శాఖ డీఆర్వో బి.లక్ష్మణ్ణ; ధర్మపురి చార్జ్ బీట్ ఆఫీసర్ తిమ్మక్క, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. పశువైద్యాధికారితో పోస్టు మార్టం చేయించారు. బాధితులకు పరిహారం అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అటవీ అధికారులు భరోసానిచ్చారు. సమీపంలోని కొండల్లో చిరుతలు ఎక్కువగా సంచరిస్తున్నాయని, గొర్రెల మంద చుట్టూ ఎత్తైన కంచెతో పాటు వీలున్న చోట విద్యుత్ బల్బులూ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

తండ్రి హత్య కేసులో కుమారుడి అరెస్ట్




నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బ్రహ్మసముద్రం: ఆస్తి కోసం కన్నతండ్రినే హతమార్చిన కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను కళ్యాణదుర్గం రూరల్ సీఐ కె.శ్రీనివాసులు ఆదివారం వెల్లడించారు. బ్రహ్మసముద్రం మండలం గుడిపల్లి గ్రామంలో గుడిపల్లికి చెందిన బోయ చెన్నమల్లప్ప(70)కు తిప్పేస్వామి, వెంకటేశులు అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరికి పెళ్లిళ్లు చేసి తనకు ఉన్న భూమిని చెరో 6 ఎకరాలు చొప్పన మొత్తం 12 ఎకరాలను తండ్రి పంచి ఇచ్చాడు. అయితే తనకు అనువైన భూమిని పంచివ్వలేదంటూ కక్ష పెంచుకున్న పెద్ద కుమారుడు తిప్పేస్వామి.. తీవ్రంగా గాయపడిన చెన్నమల్లప్పను కుటుంబసభ్యులు కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఘటనపై హత్య కేసు నమోదు చేసిన పోలీసులు... ఆదివారం భైరసముద్రం సమీపంలో ఆంజనేయస్వామి గుడి వద్ద తచ్చాడుతున్న నిందితుడు తిప్పేస్వామిని గుర్తించి అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో చొరవ చూపిన బ్రహ్మసముద్రం ఎస్‌ఐ పరుశురాముడు, కానిస్టేబుళ్లు జానకీరాం, యువరాజు, సురేంద్రను ఈ సందర్భంగా సీఐ కె.శ్రీనివాసులు అభినందించారు.

ఫ్యాక్షన్ గడ్డపై శాంతికుసుమాలు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చర్యలతో గ్రామాల్లో వర్గ కక్షలు దూరం
- నేటి నుంచి 3వ విడత ప్రజా సంక్షేమ పాదయాత్ర
- ఉదయం 7 గంటలకు వెంకటరెడ్డిపల్లిలో ప్రారంభం

తాడిపత్రి: ఫ్యాక్షన్ ప్రభావితంతో అతలాకుతలమైన తాడిపత్రి నియోజకవర్గంలో శాంతి కుసుమాలు విరబూసేలా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన చర్యలు సత్ఫలితాన్నిచ్చాయి. జగన్ సర్కార్ సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుని ఓ వైపు ప్రజలు స్వశక్తితో ఆర్థికంగా ఎదుగుతున్నారు. మరో వైపు ఎమ్మెల్యే పెద్దారెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటికి సంతృప్తికరమైన పరిష్కారాలను చూపుతుండడంతో గ్రామాల్లో వర్గకక్షలు దూరమయ్యాయి. ఇందులో భాగంగా ఇప్పటికే రెండు విడతలుగా పూర్తయిన పెద్దారెడ్డి ప్రజాసంక్షేమ పాదయాత్ర... సోమవారం నుంచి మూడో విడత ప్రారంభం కానుంది.



అడుగడుగునా బ్రహ్మరథం..

ఇప్పటి వరకు రెండు విడతలుగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి చేపట్టిన పాదయాత్రకు ఆయా మండలాల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఎన్నికలు వచ్చే వరకూ ప్రజల ముఖం చూడని నాయకులున్న తాడిపత్రి నియోజకవర్గ చరిత్రను మారుస్తూ ఎమ్మెల్యే పెద్దారెడ్డి నిత్యమూ ప్రజలతో మమేకమై నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేశారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతూ వచ్చింది.

కుట్రలు, కుతంత్రాలు తిప్పి కొడుతూ..

తొలి రెండు విడతల్లో పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాల్లో ఎమ్మెల్యే పెద్దారెడ్డి చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన దక్కడంతో ప్రతిపక్ష నాయకులు జీర్ణించుకోలేకపోయారు. కుట్రలు, కుతంత్రాలతో పాదయాత్రను భగ్నం చేసేందుకు విఫలయత్నం చేశారు. అసత్య కథనాలతో కరపత్రాలు పంపిణీ చేశారు. అయినా ప్రజాభిమానం ఎదుట ఈ కుట్రలేవీ సాగలేదు. విపక్షాల ప్రతి ఒక్క ఆరోపణకూ సరైన సమాధానాలను ఆధారాలతో సహా నిరూపిస్తూ ముందుకు సాగడంతో పెద్దారెడ్డి బలం మరింత పెరిగింది. తన పాదయాత్రలో ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఇప్పటి వరకూ ప్రజలకు చేకూరిన లబ్ధి, ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలను ఎమ్మెల్యే చైతన్య పరుస్తూ ముందుకు సాగుతున్నారు.

నేటి నుంచి పర్యటన..

సోమవారం ఉదయం 7 గంటలకు మూడో విడత ప్రజా సంక్షేమా పాదయాత్రను ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రారంభించనున్నారు. తాడిపత్రి మండలంలోని వెంకటరెడ్డి పల్లి నుంచి ప్రారంభం కానున్న పాదయాత్ర... తేళ్లమిట్టపల్లి, గదరగుట్టపల్లి, బుగ్గ, భోగసముద్రం గ్రామాల మీదుగా అయ్యవారిపల్లికి చేరుకుంటుంది. రాత్రికి ఎమ్మెల్యే పెద్దారెడ్డి అక్కడే బస చేస్తారు. తిరిగి మంగళవారం ఉదయం అయ్యవారిపల్లి నుంచి పాదయాత్రను కొనసాగిస్తారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

- కలెక్టర్ గౌతమి

అనంతపురం క్రైం: జగనన్న లే అవుట్లలో చేపట్టిన గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. నగర పరిధిలో గృహ నిర్మాణలపై నగర పాలక సంస్థలోని కౌన్సిల్ హాల్‌లో గృహ నిర్మాణ, మెప్మా, అమినిటీస్‌తో ఆదివారం ఆమె సమీక్షించారు. కొడిమి, సిద్ధరాంపురం, ఆలమూరు లే అవుట్లలో నిర్మాణాల్లో చోటు చేసుకున్న జాప్యంపై సంబంధిత ఏఈలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కారణాలపై ఆరా తీశారు. పనులు వేగవంతంగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేయాలంటూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ప్రస్తుతమున్న 9 మంది అమినిటీస్‌తో పాటు మరికొందరిని విధులకు కేటాయించాలని సూచించారు. లేబర్ సమస్య ఉందని, దీని కారణంగా నిర్మాణాల్లో జాప్యం చోటు చేసుకుంటున్నట్లు అధికారులు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ స్థానికంగా ఉండే కూలీలకు పనులు కల్పించాలని హౌసింగ్ పీడీ కేశవనాయుడు, ఆర్డీఓ మధుసూదన్‌కు సూచించారు. సాంకేతిక సమస్యలను అధిగమించి, నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని, 30 రోజుల్లో వ్యవధిలో ప్రగతి కనిపించకపోతే ఉపేక్షించబోమని హెచ్చరించారు. నగర పాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఏసీపీ సువర్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగి బాలుడి మృతి



మృతుడు హాజీబాబా

యాడికి: ఈత సరదా ఓ బాలుడి ప్రాణాలు బలిగొంది. తల్లిదండ్రులకు తీరని విషాదం మిగిల్చింది. పోలీసులు తెలిపిన మేరకు.. యాడికి మండలం తిప్పారెడ్డిపల్లికి చెందిన లారీ డ్రైవర్ హాజీపీరా, రమీజా దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. చిన్నకుమారుడు హాజీబాబా (17) ఆదివారం మధ్యాహ్నం స్నేహితులు శ్రీకాంత్, మంజునాథ్‌తో కలసి సమీపంలోని వంకలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో పై నుంచి వంకలోకి తలకిందులుగా దూకిన హాజీబాబా ఎంతసేపటికీ బయటకు రాలేదు. భయపడిన స్నేహితులు వెంటనే సమాచారం అందించడంతో గ్రామస్తులు అక్కడకు చేరుకుని వంకలో గాలించి హాజీబాబాను వెలికి తీసి, 108 అంబులెన్స్ ద్వారా తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

కనగానపల్లి (ఆత్మకూరు): ఆత్మకూరు మండలంలోని పంపనూరులో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం భక్తులు పంచామృతాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, ఆకుపూజ, మహానైవేద్యం, పల్లకీసేవ, మహా మంగళారతి పూజలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి, స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కొందరు భక్తులు కుజదోషం, కాలసర్పదోష నివారణకు హోమాలు, పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఈఓ అక్కిరెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం ఉంటుందని కమిషనర్ రమణారెడ్డి ఆదివారం తెలిపారు. స్పందనలో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్యం, తదితర అధికారులు అందుబాటులో ఉంటారని, నగర ప్రజలు తమ సమస్యలు ఏమైనా ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కమిషనర్ తెలిపారు.

దాదులూరు పోతలయ్యకు పూజలు



పూజలందుకొంటున్న పోతలయ్యస్వామి

కనగానపల్లి: దాదులూరు పోతలయ్యస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి బోనాలు సమర్పించారు. తర్వాతా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని సౌకర్యాలు కల్పించారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టండి

రాప్తాడు: ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు. ఆదివారం ఆయన అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డిని కలిసి దళిత, గిరిజనుల సమస్యలు పరిష్కారించాలని వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమం జేఏసీ నాయకులు పూసల మధు, హంపాపురం శివ, రేకులకుంట రామాంజనేయులు, గాండ్లపర్తి నల్లప్ప, లక్ష్మన్న, కుల్లాయప్ప, రాజు, బాల, రామకృష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నాగ ప్రతిష్ట



దత్తాత్రేయ ఆలయంలో నిర్వహించిన నాగప్రతిష్ట

అనంతపురం కల్చరల్: నగరంలోని ప్రాచీన దత్తాత్రేయ ఆలయంలో మూడురోజులుగా సాగిన నాగప్రతిష్ట కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. వేదపండితులు చిదంబర శాస్త్రి, ప్రధాన అర్చకుడు మురళీధర శాస్త్రి ఉదయం యంత్ర ప్రతిష్టలు, విగ్రహ ప్రతిష్టలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం మూడురోజుల హోమాలు పూర్ణాహుతితో ముగించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధి అప్పా సుదీర్ ఆధ్వర్యంలో పురోహిత సంభావనలు, భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగాయి.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు



జాతీయ రహదారిపై బోల్తా పడిన నీళ్ల ట్యాంకర్

కనగానపల్లి: జాతీయ రహదారిపై మొక్కలకు నీరు పెడుతున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టింది. దీంతో నీటి ట్యాంకర్‌తో పాటు ట్రాక్టరు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన మేరకు.. రామగిరి మండలం కుంటిమద్దికి చెందిన కాంట్రాక్టర్ చంద్ర ఆదివారం తన ట్రాక్టరు (నీటి ట్యాంకర్)తో జాతీయ రహదారిపై ఉన్న మొక్కలకు నీరు పెడుతున్నాడు. ఈ సమయంలో జాతీయ రహదారిపై వేగంగా వచ్చిన లారీ ట్రాక్టరుకు వెనుక వైపు ఉన్న నీటి ట్యాంకరును ఢీకొట్టింది. దీంతో ట్యాంకర్‌తో పాటు ట్రాక్టరు ఇంజిన్ కూడా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టరులో ఉన్న చంద్రతో పాటు లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

శ్రీఆంజనేయం.. ప్రసన్నాంజనేయం



టీటీడీ ఆధ్వర్యంలో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించిన దృశ్యం



హనుమంతునికి శివబాలయోగి ఆశ్రమంలో వడల అలంకరణ



హౌసింగ్ బోర్డులోని ఆంజనేయ స్వామి విగ్రహానికి ముస్తాబు



ఆంజనేయస్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు



అలంకరణలో అభయాంజనేయస్వామి



సోములదొడ్డి వద్దనున్న అభయాంజనేయస్వామి

అనంతపురం కల్చరల్: నగరంలో హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయాల్లో 'శ్రీఆంజనేయం.. ప్రసన్నాంజనేయం' అంటూ భక్తులు హనుమ నామ స్మరణ చేశారు. ఆలయాల్లో అభిషేకాలు, అలంకార సేవలు, ఆకుపూజలు, అన్నదానం, గ్రామోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. రెవెన్యూ కాలనీలోని వరదాంజనేయస్వామి గుడిలో హనుమద్ జయంతి వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదానం, వేద పండితుల ప్రవచనం జరిగాయి. టీటీడీ నిర్వాహకులు బాబు, పండిట్ వేణు, సుధామణమ్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు. తపోవనంలో శివశక్తిబాబా మందిరంలో సాయిట్రస్టు వారి ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణం చేయించారు. శివబాలయోగి ఆశ్రమంలో, స్థానిక కోర్టురోడ్డులోని శ్రీవరదాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి. స్థానిక హౌసింగ్‌బోర్డులోని భక్తాంజనేయస్వామి ఏకశిలా విగ్రహ ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించారు. ద్వారకావిలాస్ వద్ద ఉన్న నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో నిత్యసురభి ట్రస్టువారు ధ్వజస్తంభ పునఃప్రతిష్ట కోసం ఆంజనేయ విగ్రహం, పాదుకలు, బలిపీఠం అందించారు. స్థానిక మారుతీనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం, ఐదోరోడ్డు, ఎర్రనేటకొట్టాల, మల్లీశ్వరీరోడ్డు తదితర చోట్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందన ధారుడైన స్వామిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అన్నదానం, సాయంత్రం నగరోత్సవం నిర్వహించారు.

అంజనా తనయుడికి కళా నీరాజనం

నగరంలోని హౌసింగ్‌బోర్డు భక్తాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అరవింద నృత్య శిక్షణాలయం వ్యవస్థాపకుడు సురేష్ మాస్టర్ శిష్యబృందాలు అంజనా తనయుడికి కళా నీరాజనాలర్పించారు.అన్నమయ్య, త్యాగయ్య, పురంధర దాస సంకీర్తనలపై చిన్నారుల ముగ్ధమనోహర అభినయం ఆకట్టుకుంది. ముఖ్యంగా దీప్తిరెడ్డి, , హాసిని, నిహారిక, విష్ణు, శ్రీజ, లాస్యశ్రీగీత, మనివ్రత, ఇషిత, తన్విక, శ్రీరిషిక, సహస్ర బృందాలు శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. అనంతరం చిన్నారులకు ఆలయ కమిటీ నిర్వాహకులు పరుచూరి రమేష్ ప్రశంసాపత్రాలు అందించి, నృత్యశిక్షణలో తర్ఫీదు నిస్తున్న సురేష్ మాస్టర్‌ను సత్కరించారు.

భగవన్నామస్మరణతో మార్మోగిన మౌనగిరి

రాప్తాడు: మండలంలోని హంపాపురం సమీపంలో ఉన్న మౌనగిరి క్షేత్రంలో భక్తుల భగవాన్ నామస్మరణతో మౌనగిరి క్షేత్రం మార్మోగింది. ఆదివారం హనుమజ్జయంతిని పురస్కరించుకొని ఆలయంలో మూడు రోజులుగా విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి మౌనగిరి క్షేత్రంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయంలో ఉదయం మౌనగిరి క్షేత్రం బ్రహ్మపీఠం వ్యవస్థాపకుడు ఈశ్వరయ్యస్వామి ఆధ్వర్యంలో 39 అడుగుల ఎత్తుగల ఏకశిలా ఆంజనేయస్వామి విగ్రహానికి హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అలరించిన భజన కార్యక్రమాలు..

మౌనగిరిక్షేత్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు నిర్వహించిన భజనలు, భక్తి గీతాలు తదితర కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం మౌనగిరి క్షేత్రం బ్రహ్మపీఠం వ్యవస్థాపకులు ఈశ్వరయ్య స్వామి సీతారాముల కల్యాణోత్సవాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాలకు అనంతపురం అడిషినల్ ఎస్పీ హన్మంతు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. మండలంలో గ్రామ గ్రామానా హనుమద్ జయంతి ఉత్సవాలను ప్రజలు వైభవంగా నిర్వహించారు. రాప్తాడులో గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం సౌకర్యం కల్పించారు. బొమ్మేపర్తిలో గ్రామ పెద్దల సహకారంతో ఆంజనేయస్వామికి పాలాభిషేకం చేశారు. లింగనపల్లిలో ఆంజనేయ స్వామికి ఆకు పూజ నిర్వహించారు.



సీతా రాముల కల్యాణోత్సవం జరిపిస్తున్న దృశ్యం



ఆంజనేయస్వామి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



హౌసింగ్‌బోర్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

ఘనంగా నరసింహస్వామి కల్యాణోత్సవం





స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి . పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడులో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం 6 గంటలకు గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, శ్రీవారికి అభిషేకం, గజిత కవచాలంకరణ, పుష్పాలంకరణ, ఆకుపూజ, అష్టోతర పూజ నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. 9.19 గంటలకు స్వామి వారి కళ్యాణం జరిగింది. ఈ కార్యక్రమానికి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఎమ్మెల్యేకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బంధువులు, స్నేహితులను వేడుకలకు పిలిపించుకోవడంతో ఊరంతా సందడిగా మారింది. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుజ్జల వరలక్ష్మీ, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, సర్పంచ్ గంగాధర్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ దాసరి చలపతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవింద రెడ్డి, ఇటుకలపల్లి, ఉప్పరపల్లి సర్పంచ్‌లు భాస్కర్ రెడ్డి, సావిత్రిశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాతిదూలం పోటీలు..

ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు సోమవారం రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. 9 అడుగుల పొడవు, 19 ఇంచులు వెడల్పు, 19 ఇంచుల ఎత్తు కలిగిన రాతిదూలం పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ. 50 వేలు, రెండో బహుమతిగా రూ. 30 వేలు, మూడో బహుమతిగా రూ. 20 వేలు, నాల్గో బహుమతిగా రూ. 10 వేలు ఇవ్వనున్నారు.

వ్యక్తి ఔన్నత్యాన్ని చాటిచెప్పేది విద్య



కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ వసీం, ఉలేమాలు

అనంతపురం: విద్యతోనే మానవ మనుగడ సాధ్యమని, విద్య వ్యక్తి ఔన్నత్యాన్ని చాటిచెప్పేందుకు దోహదపడుతుందని అనంతపురం నగర మేయర్ వసీం పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం నగర శివారులోని జియావుల్ ఉలూమ్ మదరసాలో ఏర్పాటు చేసిన దస్తర్బందీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బెంగళూర్, తుంకూరు ప్రాంతాలకు చెందిన ఉలేమాలు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. జియ ఉల్ ఉలుం మదర్సా నుంచి ఖురాన్ పఠనాన్ని పూర్తి చేసిన చిన్నారులను ఉలేమాలు సన్మానించారు. విద్యకు ఉన్నత ప్రాధాన్యత మరే రంగానికీ లేదని, ప్రస్తుతం మదర్సాలో ఒకటో తరగతి నుంచి ఆంగ్లమాధ్యమాన్ని అభ్యసించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఉలేమాలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫయాజ్, ఖాజా, లక్ష్మీనగర్ ఖాజా, మోహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తాళాల భజన పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న గ్రామస్తులు

గార్లదిన్నె: ముకుందాపురంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి తాళాల భజన పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో 29 భజన బృందాలు పాల్గొనగా అలంకొండకు చెందిన అన్నపూర్ణ విశ్వేశ్వర భజన మండలి, ఉయ్యాలవాడకు చెందిన మూల పెద్దమ్మ భజన మండలి,గుర్రపాడుకు చెందిన శీలక్ష్మీనరసింహస్వామి భజన మండలి, శంకరాపురానికి చెందిన శ్రీరామాంజనేయ భజన మండలి, హాళికెరకు చెందిన ఆంజనేయస్వామి భజన మండలి, పెట్నికోటకు చెందిన సీతారామాంజనేయ భక్త మండలి తొలి ఐదు స్థానాల్లో నిలిచాయి. వీరికి వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.16 వేలు నగదు బహుమతులు అందజేశారు. మొత్తం 21 బృందాలకు నగదు బహుమతి, మిగతా జట్లకు ప్రోత్సాహక బహుమతి అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గోపుర కలశ ప్రతిష్ట



వేదావతి నది వద్ద గంగపూజ నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గం రూరల్: మండలంలోని కెంచానపల్లి, కాశీపురం గ్రామాల మధ్య పోలేరమ్మ ఆలయ గోపురానికి ఆదివారం భక్తిశ్రద్ధలతో కలశ ప్రతిష్ట గావించారు. గ్రామానికి చెందిన గాజుల గోవిందప్ప కుమారుల ఆర్థిక సహకారంతో గోపుర కలశం సిద్ధం చేయించారు. గోపుర కలశ ప్రతిష్ట సందర్భంగా ఆలయంలో బెంగళూరుకు చెందిన వేద పండితులు శాంతిహోమం, రుద్రహోమం, నవగ్రహ హోమం చేపట్టారు. గోపుర కలశాన్ని గ్రామంలో ఊరేగించి, వేదావతి నది వద్ద గంగపూజ గావించిన అనంతరం ఆలయం వద్దకు తీసుకెళ్లి పండితుల సమక్షంలో ప్రతిష్టించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గాజుల లక్ష్మీపతి, గాజుల వెంకటేశులు, అడ్వకేట్ గాజుల ఆదెన్న, గాజుల నాగభూషణ, గాజుల రామ్మూర్తి , గోపాలప్ప, సూర్యప్రకాష్, నారాయణ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జేసీఎస్ కన్వీనర్లకు సన్మానం





అనంతపురంలో ఆదివారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతులమీదుగా సన్మానం పొందుతున్న రాప్తాడు జేసీఎస్ కన్వీనర్ బోయ రామాంజనేయులు, అనంతపురం జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్‌రెడ్డి, చింతకుంట మధు, ఆలమూరు శ్రీనివాస రెడ్డి, రామ్, లక్ష్మణ్



శింగనమల నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్లతో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి

రాప్తాడురూరల్: ప్రతి విద్యార్థీ బాగా చదివి తల్లిదండ్రులు కలలు నెరవేర్చాలని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, దాసరి వాసంతి సాహిత్య పిలుపునిచ్చారు. ఆదివారం నరగంలోని ఎస్‌ఆర్‌ఐ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ×టాలెంట్ హంట్ – 2023₹ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డిప్యూటీ మేయర్లతో పాటు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెన్నపూస రవీంద్రారెడ్డి, యూట్యూబర్ వైభవ్, డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత భరత్, సామాజికవేత్త అనిల్, ఎస్‌ఆర్‌ఐ విద్యాసంస్థల చైర్మన్ వెన్నపూస విశ్వనాథ్‌రెడ్డి, ఎండీ వెన్నపూస చంటిరెడ్డి హాజరయ్యారు. టాలెంట్ హంట్ – 23 పరీక్షకు విద్యార్థులు భారీగా వచ్చారు. మొదటి 20 స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఉచిత చదువుతో పాటు భోజనం, పుస్తకాలు ఉచితంగా ఇవ్వనున్నట్లు విద్యా సంస్థల చైర్మన్ వెన్నపూస విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. 21 నుంచి 50 వరకు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 80 శాతం, 51 నుంచి 100 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 50 శాతం ఫీజు మినహాయింపు ఇస్తామన్నారు.

అన్నదానం ఎంతో గొప్పది

అనంతపురం క్రైం: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి పేర్కొన్నారు. జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి తల్లి ఆలమూరు నరసమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా జీజీహెచ్ ఆవరణలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబీకులు ఆలమూరు వెంకటశివారెడ్డి, భవిష్య రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, నాయకులు పెన్నోబులేసు, కృష్ణంరఘు, చుక్కలూరు దిలీప్ రెడ్డి, సురేష్, సాయి ట్రస్టు విజయ్‌సాయి, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ మహాకవి సమ్మేళనం

అనంతపురం కల్చరల్: ఈనెల 28న రాయలసీమ సాంస్కృతికోద్యమంలో భాగంగా మహాకవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయలసీమ సాంస్కృతిక వేదిక, వేమన అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే కవి సమ్మేళనంలో పాల్గొనేవారు తమ కవితలను ఈనెల 25లోపు సెల్ : 9962544299లో పంపాలన్నారు.

'సాక్షి' ఆధ్వర్యంలో వేసవి శిక్షణశిబిరం

అనంతపురం కల్చరల్: వేసవి సెలవులను విద్యార్థులు ఉపయుక్తంగా మార్చుకోవడానికి 'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో రెండు రోజుల వేసవి శిక్షణ శిబిరం జరగనుంది. ఈనెల 16, 17 తేదీల్లో స్థానిక కృష్ణకళా మందిరంలో ఉదయం, సాయంత్రం వేర్వేరు బ్యాచ్‌ల్లో వెస్ట్రన్, సెమీ క్లాసికల్, ఫోక్ డాన్సులు, చిత్రలేఖనం, క్రాఫ్టు, కరాటే తదితర అంశాల్లో ఉచిత అవగాహన, శిక్షణ ఉంటుంది. సీనియర్ ఆర్ట్, డాన్సు మాస్టర్ కత్తి విజయ్‌కుమార్ ఆసక్తి గల విద్యార్థులకు శిక్షణ అనంతరం ఇంటి వద్దనే నేర్చుకోవడానికి వీలుగా మెలకువలు నేర్పిస్తారు. మరిన్ని వివరాలకు సెల్: 9492288307లో సంప్రదించొచ్చు.

ఘనంగా మదర్స్ డే

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లో పారిశుధ్య కార్మికులు ఆదివారం మదర్స్ డే నిర్వహించారు. కేక్ కట్ చేసి, పంపిణీ చేశారు. ఈసందర్భంగా పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ ఆస్పత్రిలోని వివిధ వార్డులను శుభ్రంగా ఉంచుతామన్నారు. రోగులు, వారి సహాయకులు చెత్తను ఎక్కబడితే అక్కడ పడేయకుండా, డస్ట్ బిన్‌లో పడేయాలని వారు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సోహైల్, నూర్, రామాంజి, రామచంద్ర, నగేష్, రాము, జయప్ప, మంజుల, భార్గవి, రాజేశ్వరి, అంజినమ్మ, నాగమణమ్మ పాల్గొన్నారు.

17,18 తేదీల్లో బైబిల్ శిబిరం

రాయదుర్గంటౌన్: చిన్న పిల్లలకు బైబిల్ బోధనలతోపాటు క్రమశిక్షణ, ఆధ్యాత్మిక విలువలు పెంపొందించేందుకు రాజీవ్ గాంధీ కాలనీలోని కేఎస్ క్రైస్ట్ చర్చిలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించే సమ్మర్ బైబిల్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాస్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కిడ్స్ సమ్మర్ బైబిల్ శిబిరం పోస్టర్లను ఆదివారం చర్చిలో ఆయనతోపాటు చర్చి సభ్యులు విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. అనంతపురానికి చెందిన చిల్డ్రన్ ఇవాలంజిలిసం ఫెలోషిప్ సహకారంతో ఈ క్యాంపు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రెండు రోజుల పాటు జరిగే కిడ్స్ సమ్మర్ బైబిల్ శిబిరానికి పంపించాలని కోరారు.

పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

తాడిపత్రి టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పద్మశాలీయ సామాజిక వర్గానికి చెందిన టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా పురస్కార అవార్డులు అందించనున్నారు. ఈమేరకు తాడిపత్రి వరదయ్య పద్మశాలి కమ్యూనిటీ హాల్ కమిటీ అధ్యక్షుడు వద్ది శివ సత్యనారాయణ, సభ్యులు సూర్యనారాయణ, చెన్నారాజగోపాల్, జలదుర్గం దామోదర్‌దాస్ ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతిలో 540 మార్కులు అంతకంటే ఎక్కువ మార్కులు, ఇంటర్‌లో 900 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు ప్రతిభా పురస్కార అవార్డుకు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 31 లోపు శ్రీ వరదయ్య పద్మశాలి కమ్యూనిటీ హాల్ సీబీ రోడ్డు తాడిపత్రి చిరునామాకు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9848822112,8098985858, సంప్రదించాలని సూచించారు. జూన్ 11న అవార్డుల ప్రదానోత్సవం జరగనున్నట్లు పేర్కొన్నారు.

డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం రూరల్: మండలంలో ఉన్న కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రఘురామమూర్తి సూచించారు. ఈమేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటనలో విడుదల చేశారు. మరిన్ని వివరాల కోసం 9030260294, 9738404413, 9398617197 నంబర్లలో సంప్రదించాలన్నారు.